

వైభవంగా బోనాలు

ఆంథోల్ మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

- 8లో



జల్సాల కోసం చోరీలు

జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు.

- 8లో



యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు.

- 8లో

న్యూస్‌రీల్

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బదిలీ

నల్లగొండ టౌన్ : జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ వీరవెల్లి శ్రీనివాసరావు బదిలీ అయ్యారు. ఆయన హైదరాబాద్‌లోని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ పరిశోధన విభాగం అధిపతిగా ఆదివారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో నియమితులయ్యారు. నల్లగొండ జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా వికారాబాద్‌లో పనిచేస్తున్న డాక్టర్ సదానందం నియమితులయ్యారు. రెండు, మూడు రోజుల్లో ఆయన విధుల్లో చేరనున్నట్లు తెలిసింది.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి



మాట్లాడుతున్న దాసరి వెంకన్న

కనగల్ : ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్ దాసరి వెంకన్న అన్నారు. ఆదివారం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల మేనిఫెస్టోలో ఆరు గ్యారంటీల్లో ఉద్యమకారులకు 250 గజాల ప్లాటు, రూ.ఐదు లక్షలతో ఇల్లు నిర్మాణం చేయిస్తామని హామీ ఇచ్చిందని.. వెంటనే ఆ హామీని అమలు చేసి ఉద్యమకారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా నాయకులు సుంకిరెడ్డి చంద్రారెడ్డి, వలికి వెంకన్న, మండల ప్రధాన కార్యదర్శి ఆరెకంటి నరసింహ, ఉపాధ్యక్షుడు వడ్డెబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని అమలు చేసే కుట్ర



మాట్లాడుతున్న నాగరాజు)

కొండమల్లేపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం నూతన విద్యా విధానాన్ని (ఎన్ఈపీ) అమలు చేసే కుట్ర చేస్తోందని రాష్ట్రంలో ఎన్ఈపీ అమలు చేయవద్దని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ తరగతులను నిర్వహించాలనే ప్రతిపాదనతో విద్యారంగానికి నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని, విద్యారంగ సమస్యలపై సీఎం విద్యార్థి సంఘాలతో సమావేశమై చర్చించాలన్నారు. ఈ సమావేశంలో లక్ష్మీనారాయణ, ఖమ్మంపాటి శంకర్, కుంచం కావ్య, లక్ష్మణ్‌నాయక్, వెంకటేష్, సైదానాయక్, కోరే రమేస్, రవీందర్, హర్షవర్ధన్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల కొనుగోలు సరికాదు



మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

మిర్యాలగూడ అర్బన్ : ఎమ్మెల్యే కొనుగోలు సంస్కృతి మంచిది కాదని కేసీఆర్ చేసిన తప్పులే రేవంత్‌రెడ్డి చేస్తే ఆయనకు పట్టిన దుస్థితి రాక తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన సీపీఐ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలు పాలించిన కేసీఆర్ అభివృద్ధిని విస్మరించి కేవలం కాళేశ్వరం కట్టి అదే అభివృద్ధి అని చూపించి అభాసుపాలయ్యారన్నారు. అలాంటి తప్పులే సీఎం రేవంత్‌రెడ్డి చేయకుండా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని సూచించారు. నల్లగొండ జిల్లాలో ఉన్న ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగిస్తూ యువతను నిరుద్యోగులుగా మార్చుతున్న బీజేపీ ప్రభుత్వం.. ఇక్కడ నిరుద్యోగ సమస్యపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బంటు వెంకటేశ్వర్లు, వల్లంపట్ల వెంకన్న, ఎండీ.సయ్యద్, బంటు రాజేశ్వరి, కాసర్ల దుర్గమ్మ, ఎన్నబోతు పద్మ, షమీం, రేణుక, రహిమ, సుజాత, రామలింగం, యాదగిరి, భిక్షం, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

● జయజయ సాయి





గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం నల్లగొండలోని సాయిబాబా ఆలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, బాబా దర్శనానికి క్యూ కట్టిన భక్తులు

పాఠశాలల్లో నేటి నుంచి శిక్షా సప్తాహ్

నల్లగొండ : జాతీయ విద్యా విధానం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం(ఈనెల 22) నుంచి 30వ తేదీ వరకు శిక్షా సప్తహ్ కార్యక్రమాన్ని నిర్వహించాలని డీఈఓ బొల్లారం భిక్షపతి ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. 22వ తేదీన ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్న సామగ్రితో టీఎల్ఎం తయారు చేసి ప్రదర్శించాలి. 23న నిపుణ్ భారత్, ఎఫ్ఎల్ఎన్ మిషన్ కార్యక్రమాలు, 24న క్రీడా, యువజన వ్యవహారాల శాఖలు ఎస్ఎస్ఎస్‌తో సమన్వయం చేసుకొని క్రీడా పోటీల నిర్వహణ, 25న విద్యార్థుల్లో ఐకమత్యంపై అవగాహన కల్పించేలా సాంస్కృతిక కార్యక్రమాలు, 26న ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు, డిజిటలీకరణపై అవగాహన కల్పించాలి, 27న ఆరోగ్యకరమైన విటమిన్లతో కూడిన సమతుల ఆహారంపై అవగాహన, 30న కమ్యూనిటీ ఇన్వాల్‌మెంట్ డే నిర్వహించాలి. రోజూ జరిగే కార్యక్రమాల ఫొటోలు, 30 సెకన్ల వీడియో గూగుల్ డ్రైవ్, జి మెయిల్ అడ్రస్‌కు పంపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను కాంప్లెక్స్ హెచ్ఎంలు పర్యవేక్షించాలని ఆదేశించారు.

పల్లె పాలనకు అప్పులు!

- పంచాయతీల్లో ఆరు నెలలుగా ప్రత్యేకాధికారుల పాలన
- అప్పటి నుంచి నిర్వహణ నిధులు ఇవ్వని ప్రభుత్వం
- అత్యవసర పనులకు అప్పులు చేస్తున్న కార్యదర్శులు
- జిల్లాలో మొత్తం రూ.20 కోట్లు సొంతంగా వెచ్చించినట్లు అంచనా

నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని ఓ మేజర్ గ్రామ పంచాయతీలో 3 వేల పైచిలుకు జనాభా ఉంది. ఆ గ్రామంలో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. అప్పటి నుంచి గ్రామంలో మోటార్ల మరమ్మతు, బ్లీచింగ్ కొనుగోలు, వీధి దీపాల ఏర్పాటు వంటి చిన్నచిన్న మెయిన్‌టెయిన్స్ కోసం ఆరు మాసాల కాలంలో రూ.3 లక్షల పై చిలుకు ఖర్చయింది. ఈ మొత్తంలో ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. ఆ పంచాయతీ కార్యదర్శి సొంతంగా రూ.3 లక్షలు అప్పు చేసి గ్రామంలో పనులు చేపట్టాడు. ఇదీ జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి.



నల్లగొండ : పంచాయతీ కార్యదర్శులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఆరు నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి ప్రభుత్వం ద్వారా ఎలాంటి నిధులు మంజూరు కాకపోవడంతో పంచాయతీ కార్యదర్శులే సొంతంగా గ్రామాల్లోని పనులకు డబ్బులు ఖర్చు చేస్తున్నారు. పంచాయతీ నిర్వహణ, మరమ్మతు పనులు తదితర వాటికి అప్పులు చేసి పనులు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో వారు అప్పులతో అవస్థలు పడుతున్నారు.

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలు

జిల్లాలో 844 గ్రామ పంచాయతీలున్నాయి. పంచాయతీలకు గత ప్రభుత్వం రాష్ట్ర, కేంద్ర ఆర్థిక సంఘాల నిధులు ఇచ్చాయి. ఎన్నికల ముందు నుంచే రాష్ట్ర నిధులు ఆగిపోవడం, కేంద్ర నిధులు కూడా వెనకాముందు వస్తుండటంతో పంచాయతీల్లో పాలకవర్గాలు చివరలో అత్యవసర పనులకు సర్పంచ్‌లు అప్పులు తెచ్చి పనులు నిర్వహించారు. ఫిబ్రవరి 2వ తేదీతో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయింది. ప్రత్యేక అధికారుల పాలన అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు పైసా నిధులు విడుదల చేయలేదు. గతంలో సర్పంచ్‌లు ఉండటంతో వారే అన్నీ చూసుకునేవారు. ప్రస్తుతం కార్యదర్శులపైనే ఆ భారం పడింది.

అప్పు తెచ్చి పనులు చేస్తున్న కార్యదర్శులు

గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరా మోటార్ల మరమ్మతు, చెత్త సేకరణ ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్ కొనుగోలు, స్ట్రీట్ లైట్లు కాలిపోతే కొత్తవి వేయడం వంటి పనులన్నీ అత్యవసరమైనవి. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని చెబుతున్న ప్రభుత్వం పైసలు మాత్రం విడుదల చేయడం లేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులే సొంతంగా అప్పుతెచ్చి పనులు చేయిస్తున్నారు. ప్రభుత్వం రెండు రోజుల క్రితం పంచాయతీల్లో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలను మంజూరు చేసింది. కానీ పంచాయతీ నిర్వహణకు సంబంధించి నిధులు విడుదల చేయకపోవడంతో కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.

రూ.20 కోట్ల వరకు పెట్టుబడి..

జిల్లాలోని చిన్న గ్రామ పంచాయతీల్లో ఒక్కో పంచాయతీ కార్యదర్శి ఆరు మాసాల కాలంలో రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టగా.. మేజర్ గ్రామ పంచాయతీల కార్యదర్శులు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల పైచిలుకే అప్పు చేసి పంచాయతీల పనులకు ఖర్చు చేశారు. మొత్తంగా చూస్తే 844 పంచాయతీల్లో దాదాపు రూ.20 కోట్ల వరకు కార్యదర్శులు ఈ ఆరు మాసాల కాలంలో పంచాయతీల నిర్వహణకు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది.

సమాజానికి బుద్ధుడి బోధనలే శరణ్యం

- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి
- బుద్ధవనంలో ధర్మచక్ర పరివర్తన దినోత్సవం



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్ : సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు బుద్ధుడి బోధనలే శరణ్యమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుద్ధవనంలో ఆదివారం నిర్వహించిన ధర్మచక్ర పరివర్తన దినోత్సవ కార్యక్రమానికి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రమేశ్‌రెడ్డి మాట్లాడుతూ బుద్ధవనం మహాద్భుతంగా ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి, నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తెచ్చి మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఆనాడు మంత్రిగా ఉన్న కుందూరు జానారెడ్డి కృషితోనే తెలంగాణలో బుద్ధవనం నిర్మితమైందని పేర్కొన్నారు. యువత బుద్ధుడి మార్గాన్ని అనుసరించాలని సూచించారు. ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ సంపాదన వల్ల సంతోషం రాదని.. బుద్ధుడు బోధించిన జీవన విధానం అనుసరించడం వల్ల వస్తుందన్నారు. ఆచార్యనాగార్జునుడు నడయాడిన ఈ ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్మించిన బుద్ధవనం ఆసియాలోనే అతిపెద్దదని పేర్కొన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన భూటాన్ విద్యాశాఖ మాజీ మంత్రి ఆచార్య ఠాకూర్‌సింగ్ మాట్లాడుతూ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో భూటాన్ ప్రపంచంలోనే అగ్రశ్రేణిలో ఉండటానికి బుద్ధుడి బోధనలే కారణమన్నారు. బుద్ధుని బోధనలను పాఠ్యాంశాల్లో చేర్చాలని సూచించారు. ముందుగా బౌద్ధభిక్షువులతో కలిసి బుద్ధుడి పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం బ్రోచర్‌ను విడుదల చేశారు. ముందుగా మహాస్థూపంలోని సమావేశ మందిరంలో బుద్ధవిగ్రహం ముందు జ్యోతి ప్రజ్వలన చేశారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. అమెరికా నుంచి వచ్చిన ప్రముఖ సితార్ విద్వాంసుడు డాక్టర్ మధుసారథి నందూరి, సితార్ వాద్య కచేరి ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, పీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, గడ్డంపల్లి వినయ్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, మార్కెట్ మాజీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, శివనాగిరెడ్డి, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



బుద్ధుడి పాదాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేస్తున్న పటేల్ రమేశ్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి తదితరులు



నారసింహహోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రిలో భక్తుల ఆరాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవ, ఆరాధన చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. అలాగే ప్రాకారం మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు గావించారు. సాయంత్రం ఆలయంలో జోడు సేవను భక్తుల మధ్యన ఊరేగించారు. రాత్రి శ్రీస్వామి, అమ్మవార్లకు శయనోత్సవం చేసి ఆలయానికి ద్వార బంధనం చేశారు.

సాహిత్యానికి ప్రజలే కేంద్ర బిందువు



గోవర్ధన్



హసేనా

నల్లగొండ : ప్రజలే కేంద్ర బిందువుగా సాహిత్యం ఉండాలని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కటుకోజ్వల ఆనందాచారి పేర్కొన్నారు. ఆదివారం నల్లగొండలోని టీఎస్‌యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాహితి ఉమ్మడి జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచీకరణ దాటికి కుదేలవుతున్న స్థానిక కళలు, భాషలను కాపాడుకోవడంలో కవులు, రచయితల పాత్ర కీలకమన్నారు. నాగార్జున డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు తండు కృష్ణకౌండిన్య మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యాన్ని అందిస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విధంగా కవిత్వం ఉండాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా ×తెలంగాణ సాహితి౯ కమిటీని ప్రకటించారు. గౌరవాధ్యక్షుడిగా తండు కృష్ణకౌండిన్య, అధ్యక్షుడిగా కుకుడాల గోవర్ధన్, ఉపాధ్యక్షులుగా పుప్పాల కృష్ణమూర్తి, బూరుగు గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.హసేన, సహాయ కార్యదర్శులుగా బండారు శంకర్, మట్టయ్యల, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పగిడిపాటి నరసింహ, కోశాధికారిగా ఉప్పలయ్య, కార్యవర్గ సభ్యులుగా బాసరాజు యాదగిరి, జార్జి, సైదులు, గేర నరసింహ ఎన్నికయ్యారు.

అడుగంటిన పులిచింతల ప్రాజెక్టు



హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టు నీరు లేక అడుగంటింది. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా డెల్టాకు నీరందించే ఈ ప్రాజెక్టు జలకళ లేక అడుగున ఉన్న రాళ్లు కనిపిస్తున్నాయి. ఈ ప్రాజెక్టులోనికి ఇప్పటి వరకు వరద నీరు రాలేదు. దీనికి తోడు స్వల్ప లీకేజీలు ఉంతో ప్రాజెక్టులో నీరు అడుగుకు చేరింది. జిల్లాలో అడపాదడపా వర్షాలు కురుస్తున్నా ఈ నీరు చెప్పుకోదగ్గ రీతిలో ప్రాజెక్టుకు చేరడం లేదు. దీంతో ప్రాజెక్టు నీరులేక వెలవెలబోతోంది. పులిచింతల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.92 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 351 క్యూసెక్కులు కాగా లీకేజీల ద్వారా అవుట్‌ఫ్లో 50 క్యూసెక్కులుగా నమోదైంది. ఇదిలా ఉండగా గత ఏడాది ఇదేరోజున ప్రాజెక్టులో 17.14 టీఎంసీల నీరు ఉంది. అప్పట్లో 3,800 క్యూసెక్కుల నీటితో పవర్ హౌజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి కూడా చేశారు.

రేబిస్ రహిత జిల్లానే లక్ష్యంగా..

- ప్రణాళికలు రూపొందించిన పశు సంవర్ధక, వైద్యారోగ్య శాఖలు
- అందుబాటులో 70వేలకుపైగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు
- 2025 వరకు కార్యక్రమం అమలుకు సన్నాహాలు
- 2030 నాటికి రేబిస్‌ను పారదోలేలా కార్యాచరణ



కుక్కలకు రేబిస్ టీకాలు వేస్తున్న పశువైద్యులు (ఫైల్)

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లాలో రేబిస్ వైరస్‌ను పూర్తిగా పారదోలి 2030 సంవత్సరం నాటికి ఉమ్మడి నల్లగొండ జిల్లాను రేబిస్ రహిత జిల్లాగా మార్చేందుకు పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి. కుక్కల ద్వారా వచ్చే రేబిస్ నివారణ కోసం నేషనల్ యాక్షన్ ప్లాన్ ఫర్ డాగ్ మేడియేటెడ్ రేబిస్ ఎలిమినేషన్ ఫ్రం ఇండియా పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కార్యాచరణ సిద్ధం చేశాయి. అందులో భాగంగా జిల్లా పశు సంవర్ధక, వైద్య ఆరోగ్య శాఖలు ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి దానికి సంబంధించిన విధివిధానాలను జిల్లాల అధికారులకు వివరించారు. వారి ఆదేశాలతో ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించి తమ నివేదికలను రాష్ట్ర అధికారులకు అందించాయి.

సిద్ధంగా యాంటీ రేబిస్ డోసులు

ఉమ్మడి జిల్లాలో 1.10 లక్షలకుపైగా వీధి కుక్కలు, 10వేలకుపైగా పెంపుడు కుక్కలు ఉన్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ ప్రభుత్వానికి నివేదించింది. ఇప్పటికే నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పశు వైద్యశాలల్లో రేబిస్ నివారణకు సరిపడా 70వేలకుపైగా యాంటీ రేబిస్ వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉంచారు. వీటిని ఉచితంగా పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు ఇచ్చే కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు.

వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు..

వీధి కుక్కలతోనే రేబిస్ వ్యాప్తి పొంచి ఉన్నందున మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ సిబ్బందితో వీధి కుక్కలను పట్టించి రేబిస్ వ్యాక్సిన్ ఇవ్వడంతో పాటు వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలనే యోచనలో పశు సంవర్ధక శాఖ ఉంది. నల్లగొండలోని చర్లపల్లిలో ఉన్న ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌లో వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలను చేయించేందుకు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇందుకు గాను వైద్య ఆరోగ్య, పశు సంవర్ధక శాఖలు ఎంపిక చేసిన వ్యక్తులకు ప్రత్యేక శిక్షణనివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. రేబిస్ వ్యాధి, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లపై ప్రజల్లోఅవగాహన కల్పించాలని నిర్ణయించారు. ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు కూడా తీసుకుంటూ 2025 వరకు కార్యక్రమాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతున్నారు.

జిల్లాకు ఒక డయాగ్నోస్టిక్ ల్యాబ్

ఉమ్మడి జిల్లాలో రేబిస్ నివారణకు అవసరమైన రేబిస్ డయాగ్నోస్టిక్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ల్యాబ్‌ల్లో యాంటీ రేబిస్ ఎలిమినేషన్‌పై పరీక్షలు నిర్వహిస్తారు. అదేవిధంగా జిల్లాలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుక్క కరిచిన వ్యక్తులకు అందించే యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచనున్నారు.

రేబిస్ నివారణకు కార్యాచరణ



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కుక్కల్లో రేబిస్ నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం కార్యాచరణ రూపొందిస్తున్నాం. త్వరలో ప్రజలకు రేబిస్‌పై కరపత్రాలు, ఇతర కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తాం. సమష్టిగా ముందుకు సాగి 2030 నాటికి ఉమ్మడి జిల్లాను రేబిస్ రహిత జిల్లాగా మారుస్తాం.

– డాక్టర్ వి.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ, నల్లగొండ

కుక్కలకు చిప్‌లు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు సాలేబుల్ చిప్‌లను ఏర్పాటు చేసేందుకు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదించారు. ఈ సాలేబుల్ చిప్ ఇంజక్షన్ ద్వారా కుక్కలకు మెడ వద్ద, శరీరంలో ప్రవేశ పెడతారు. చిప్‌లో కుక్క వయసు, యజమాని పేరు, ఏ జాతికి చెందినది, టీకాలు ఎప్పుడు వేసింది తదితర వివరాలన్నింటిని పొందుపరుస్తారు. రేబిస్ వ్యాక్సిన్ వేసిన విధంగానే సాలేబుల్ చిప్‌లు కూడా కుక్కలకు వ్యాక్సిన్ రూపంలో వేస్తారు. ఇప్పటికే ఈ విధానం హైదరాబాద్‌లో పెంపుడు కుక్కలకు అందుబాటులోకి తెచ్చారు.

క్లుప్తంగా

గుట్కా ప్యాకెట్లు పట్టివేత



పట్టుబడిన గుట్కా ప్యాకెట్లతో పోలీసులు

మఠంపల్లి: ఆంధ్రప్రదేశ్ నుంచి బైక్‌పై గుట్కా ప్యాకెట్లను తీసుకొస్తుండగా శనివారం రాత్రి మఠంపల్లి మండలంలోని జాన్‌పహాడ్ రోడ్ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం .. నేరేడుచర్లకు చెందిన పాన్‌షాప్ యజమాని షేక్ నజీర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా పిడుగురాళ్ల నుంచి ప్రభుత్వ నిషేధించిన గుట్కా ప్యాకెట్లు బైక్‌పై తీసుకొస్తుండగా.. మఠంపల్లి మండలం జాన్‌పహాడ్ రోడ్ శివారులో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్ల విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. బైక్‌ను, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్: మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. లక్కారం గ్రామానికి చెందిన సూరిశెట్టి శ్రీధర్ ఇంటిపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి ఇంట్లో నిల్వ ఉంచిన నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మిర్యాలగూడ టౌన్ : ముగ్గురు పేకాటరాయుళ్లను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కె. నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం అవంతీపురం వ్యవసాయ మార్కెట్ సమీపంలో గల ఖాళీ స్థలంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.1800 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా ఆంథోల్ మైసమ్మ బోనాలు



బోనాలను ఎత్తుకొని వస్తున్న మహిళలు, యువతులు



శివసత్తుల విన్యాసాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని శ్రీఆంథోల్ మైసమ్మ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రెండో రోజు చండీ హోమంతో పాటు బోనాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానన్నారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్. మోహన్‌బాబు, మాజీ సర్పంచులు బొంతల ఓంప్రకాష్, ఎలువర్తి యాదగిరి, మాజీ ఎంపీటీసీ చిట్టంపల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు చిలుకూరి మల్లారెడ్డి, బుర్ర స్వామి, ముదిగొండ రమేష్, గుండు శ్రీహరి, చిట్టంపల్లి జంగయ్య, ఈడ్దుల విజయ్, గంగాధర గణేష్, అత్తాపురం అంజిరెడ్డి, ఎలువర్తి రవీందర్, కంచర్ల ప్రవీణ్‌రెడ్డి, బాలగోని శ్రీకాంత్, అన్నదాన దాత కామిశెట్టి విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

చింతపల్లిలో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు లక్ష పుష్పార్చన, పంచామృతాభిషేకం, కాగడ హారతి, సంస్థాన హారతి, మధ్యాహ్న హారతి కార్యక్రమాలతో పాటు వేద పండితులతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి సాయినాథుడిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచుకంటి ధనుంజయ్య, మండల పార్టీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, పవన్‌కుమార్, ముచ్చర్ల యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, రాంసింగ్, గోవిందుయాదగిరి, సదానందం, రాధాకిషన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సాయినాథుడికి పూజలు చేస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు



సాయినాథుడిని దర్శించుకునేందుకు క్యూలో వేచిచూస్తున్న భక్తులు

జల్సాల కోసం చోరీలు.. దొంగ అరెస్ట్

- 26 తులాల బంగారం, కేజీ వెండి స్వాధీనం

కోదాడరూరల్ : ఇళ్లల్లో చోరీలు చేస్తున్న దొంగను కోదాడ పట్టణ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి సీఐ రాముతో కలిసి ఆదివారం కోదాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం మామకన్ను గ్రామానికి చెందిన సయ్యద్ అల్తాఫ్ అలియాస్ అఫ్రోజ్ తల్లిదండ్రులు చిన్నతనంలో మృతి చెందారు. దీంతో అతడు తన బాబాయి వద్ద పెరిగాడు. అల్తాఫ్‌కు స్నేహితులతో కలిసి జులాయిగా తిరుగుతూ మద్యం, బెట్టింగ్‌లకు బానిసయ్యాడు. దీంతో విలాసాలకు డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనాలు చేస్తూ జైలు జీవితం కూడా గడిపాడు. మార్చి 18వ తేదీన బెయిల్‌పై బయటకు వచ్చిన అల్తాఫ్ నాలుగు నెలల వ్యవధిలో కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోలీస్ స్టేషన్ పరిధిలోని 6 ఇళ్లలో, కోదాడ పట్టణంలోని మూడు ఇళ్లలో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించాడు. ఆదివారం కోదాడ పట్టణంలోని గోల్డ్ షాప్ బజారులో ఆభరణాలు విక్రయించేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతడి వద్ద బంగారం, వెండి ఆభరణాలు లభ్యమవ్వడంతో అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. నిందితుడి వద్ద పోలీసులు 26 తులాల బంగారం, ఒక కేజీ నాలుగు వందల గ్రాముల వెండి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్‌ఐ మల్లేష్, పోలీస్ సిబ్బంది యల్లారెడ్డి, సతీష్‌నాయుడు ఉన్నారు.



ఆభరణాలను చూపుతున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రాము, పోలీస్ సిబ్బంది

గుండెపోటుతో గొర్రెలకాపరి మృతి



లచ్చయ్య (ఫైల్)

త్రిపురారం: గుండెపోటుతో గొర్రెలకాపరి మృతి చెందాడు. ఈ ఘటన త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఆదివారం మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబుసాయిపేట గ్రామానికి చెందిన మోదాల లచ్చయ్య గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం గొర్రెలను మేపడానికి గ్రామ సమీపంలోని తోటి గొర్రెల కాపరులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తుండగా.. గుండెలో నొప్పి వస్తుందంటూ తోటి గొర్రెల కాపారులకు చెప్పి పడిపోయాడు. దీంతో వారు లచ్చయ్య కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలించే లోపే గుండెనొప్పి తీవ్రమై మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య



నవీన్ కుమార్ (ఫైల్)

బొమ్మలరామారం: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బొమ్మలరామారం మండలం చీకటిమామిడి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకటిమామిడి గ్రామానికి చెందిన కదారి నవీన్ కుమార్(32) వృత్తిరీత్యా కటింగ్ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అతడు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన ఆరోగ్యం కుదుటపడటం లేదని తీవ్ర మనస్తాపానికి గురైన నవీన్ కుమార్ ఆదివారం తెల్లవారుజామున తన ఇంట్లో చీరతో ఉరేసుకుని మృతిచెందాడు. మృతుడి భార్య కదారి భాగ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

యాదాద్రిలో తగ్గిన భక్తుల రద్దీ



భక్తులు లేక బోసిపోయిన ఉత్తర మాడ వీధి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో వచ్చారు. సికింద్రాబాద్‌లో మహంకాళి అమ్మవారికి బోనాలతో పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో స్వామివారి చెంతకు భక్తుల రాక గణనీయంగా తగ్గింది. దీంతో స్వామి వారి ధర్మ దర్శనానికి గంట, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. స్వామి వారిని 30వేల వరకు భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆదివారం కిటకిటలాడే ఆలయ పరిసరాలు.. భక్తులు లేక బోసిపోయాయి. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.25,23,042 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

సూర్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయాసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అదే విధంగా క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, పాలెల్లి వెంకటేశ్వర్లు, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



పాలకవీడు : మృతిచెందిన పాడి గేదె

పాలకవీడు: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందింది. ఈ ఘటన పాలకవీడు గ్రామ సమీపంలోని వ్యవసాయ భూముల్లో ఆదివారం జరిగింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు గ్రామానికి పగడాల మట్టేష్ రోజు మాదిరిగా తన పాడి గేదెను ఆదివారం గ్రామ సమీపంలోని పొలాల్లోకి మేతకు తోలుకెళ్లాడు. గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద గల విద్యుత్ స్టార్టర్ బాక్స్ తెగిపడి ఉండగా పాడి గేదె మేత మేసుకుంటూ వెళ్లి దానికి తగిలి విద్యుదాఘాతానికి గురైంది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించి విద్యుత్ సరఫరాను నిలిపివేయగా.. అప్పటికే గేదె మృతి చెందింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రాజాపేటలో..

రాజాపేట: మండలంలోని చల్లూరు గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. చల్లూరు గ్రామానికి చెందిన రైతు గంగు రాజిరెడ్డి తన వ్యవసాయ బావి వద్ద రోజుమాదిరిగానే ఆదివారం పాడి గేదెను మేత కోసం వదలగా పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.1.20లక్షలు ఉంటుందని, జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

బస్సును ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

భువనగిరి క్రైం: భువనగిరి బస్టాండ్ సమీపంలో బస్సును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్టకు చెందిన హరిప్రసాద్ మరో వ్యక్తితో కలిసి శనివారం అర్ధరాత్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఉన్న తన బంధువులను చూసేందుకు కారులో వెళ్తున్నారు. అదే సమయంలో బస్టాండ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న హరిప్రసాద్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన కారును పక్కకు తొలగించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏడు కోడెదూడల పట్టివేత

కోదాడరూరల్: అక్రమంగా తరలిస్తున్న ఏడు కోడెదూడలను ఆదివారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతల నుంచి పశువుల వ్యాపారం చేసే జిడ్డు నాగరాజు ఏడు కోడెదూడలను వాహనంలో కోదాడ సంతకు తరలిస్తుండగా.. రామాపురం క్రాస్ రోడ్‌లో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన దూడలను కట్టంగూరులోని గోశాలకు తరలించి డ్రైవర్ ప్రకాష్‌రావుతో పాటు పశువుల వ్యాపారి నాగరాజుపై కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బావిలోకి దిగి ఊపిరాడక రైతు మృతి



లక్ష్మయ్య (ఫైల్)

మునగాల(కోదాడ): బోరు మోటారును బయటకు తీసేందుకు బావిలోని దిగిన రైతు ఊరిరాడక మృతిచెందాడు. ఈ ఘటన మునగాల మండలం కలకోవ గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కలకోవ గ్రామానికి చెందిన కొమర్రాజు లక్ష్మయ్య(52) తనకున్న ఎకరంన్నర భూమితో పాటు మరో నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. కౌలుకు తీసుకున్న భూమిలో గతంలో బావి ఉండేది. ఇటీవల ఆ బావిని పూడ్చివేసి అందులో వేసిన బోరు చుట్టూ రెండు అడుగుల గూనలు 20 వరకు వేశాడు. ఇదిలా ఉండగా బోరు మోటారు మరమ్మతుకు గురికావడంతో లక్ష్మయ్య తన తోటి రైతు తిప్పన శేషగిరి సాయంతో ఆదివారం బావిలోకి దిగి మోటారును పైకి లాగేందుకు తాడు కడుతుండగా ఊపిరిడాక అందులోనే ప్రాణాలు వదిలాడు. బావి బయట ఉన్న శేషగిరి ఇది గమనించి వెంటనే గ్రామంలోని పలువురికి సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి దొంగరి సైదులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరకుని తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులుకు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులు, ఫైర్ సిబ్బందికి ఫోన్ ద్వారా విషయం చెప్పడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు బావిలోకి దిగే ప్రయత్నం చేసినప్పటికీ ఊపిరాడకపోవడంతో బయటకు వచ్చారు. దీంతో ఫైర్ సిబ్బంది, స్థానికుల సహకారంతో జేసీబీని ఉపయోగించి గూనలు తొలగించి లక్ష్మయ్య మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్యకు భార్య మాత్రమే ఉంది. సంతానం లేరు. కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, ఏఎస్‌ఐ కల్లు శ్రీనివాసరెడ్డి సహాయక చర్యలను పర్యవేక్షించారు.



లక్ష్మయ్య మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది

మహిళా కూలీలను ఢీకొట్టిన టాటా ఏస్

- ముగ్గురికి గాయాలు

కోదాడరూరల్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళా కూలీలను టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కోదాడ మండలం దోరకుంట శివారులో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోరకుంట గ్రామానికి చెందిన మహిళా కూలీలు నాట్లు వేసేందుకు విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టాటా ఏస్ వాహనం వారిని గ్రామ శివారులో ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సుంకరి రాజ్యలక్ష్మి, దొంగరి రమాదేవి, ఎర్రంశెట్టి కావ్యకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజ్యలక్ష్మికి తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కోదాడ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల కుటుంబ సభ్యులు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెద్దఅడిశర్లపల్లి: బైక్‌పై వెళ్తూ ఆర్టీసీ బస్సును ఢీకొట్టి యువకుడు దుర్మరణం చెందాడు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలం కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలం అల్వాలకు చెందిన లింగంపల్లి కొండల్(19) పెద్దవూర మండలం పులిచర్లలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. పని నిమిత్తం ఆదివారం తన బావమరిది వాకిటి అజయ్‌తో కలిసి బైక్‌పై పెద్దఅడిశర్లపల్లి మండలం అంగడిపేట ఎక్స్ రోడ్ వద్దకు వచ్చి తిరిగి పులిచర్లకు వెళ్తుండగా.. పెద్దఅడిశర్లపల్లి మండలం కోనమేకలవారిగూడెం గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై దేవరకొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కొండల్ అక్కడికక్కడే మృతి చెందగా, అజయ్‌కి తీవ్రగాయాలయ్యాయి. అజయ్‌ని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత.. ఐదుగురి అరెస్ట్

నేరేడుచర్ల: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేసి, వారి నుంచి 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున రైస్ మిల్లు సమీపంలో గల వెంచర్‌లో కొందరు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్‌నాయక్, పోలీస్ సిబ్బందితో కలిసి దాడులను నిర్వహించారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలోని యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో పనిచేసేందుకు బిహార్ రాష్ట్రం నుంచి వచ్చిన రాంచంద్రమహార, సునీల్ ప్రసాద్‌తో పాటు సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం సాదుతండాకు చెందిన ధారవత్ ముఖేష్, పాలకీడు మండలం మీగడంపాడుతండాకు చెందిన మాలోతు సంతోష్, మఠంపల్లి మండలం మచ్చతండాకు చెందిన రూపావత్ సాయికుమార్‌ను అరెస్ట్ చేశారు. వారి నుంచి 100 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్‌ఐ రవీందర్‌నాయక్, ఏఎస్‌ఐ సైదులు, పోలీసు సిబ్బంది సురేష్, వెంకట్, జుబేరీపాష, మతిన్‌ను సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చరమందరాజు

ప్రకృతి.. సకల ఔషధాల నిధి



మాట్లాడుతున్న ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు



సదస్సుకు హాజరైన ప్రజలు

- ప్రకృతి వైద్యుడు రామచంద్రరావు

రామగిరి(నల్లగొండ): ప్రకృతి సకల ఔషధాల నిధి అని సిద్ధార్థ యోగా విద్యాలయం, ప్రకృతి వైద్యుడు కేవై రామచంద్రరావు అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, సిద్దార్థ యోగా విద్యాలయం సంయుక్తంగా నల్లగొండ పట్టణంలోని చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన 'ప్రకృతి జీవన విజ్ఞానం' ఆరోగ్య సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతిపై అవగాహన ఉంటే చిన్న చిన్న రోగాలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా దూరం చేసుకోవచ్చన్నారు.యోగా, మెడిటేషన్‌తో పాటు జొన్నలు, రాగులు, మినుములు వంటి మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఇలాంటి సదస్సులు నిర్వహించిన గాంధీ గ్లోబల్ ఫ్యామిలీకి అభినందనలు తెలిపారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణుడు ఎస్‌జీ పద్మ మాట్లాడుతూ.. సిద్దార్థ యోగా విద్యాలయం రూపొందించిన డైట్ షీట్‌ను దైనందిక జీవితంలో అలవాటు చేసుకోవాలని అన్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల చైర్మన్ డాక్టర్ గున్న రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సంస్థల ద్వారా ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి సుమారుగా 1200 పైగా ప్రముఖులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావేత్తలు, విద్యార్థులు, క్రీడాకారులు, యువతీయువకులు హాజరయ్యారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యానాల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో డాక్టర్స్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ యూట్యూబ్ ఇన్‌ఫ్లూయెన్సర్ ఏచూరి శైలజ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు బొమ్మపాల గిరిబాబు, పాముల అశోక్, లోకనబోయిన రమణ, గిరిధర్‌రావు, నాగమణిరెడ్డి, ముక్కామల నరసింహ, ఎండీ అజీజ్, దశరథగౌడ్, పజ్జూరి రవీందర్‌రెడ్డి, ప్రముఖ పర్యావరణవేత్త మిట్టపల్లి సురేష్‌గుప్తా, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోడి శ్రీనివాస్, జీవీ రావు తదితరులు పాల్గొన్నారు.